క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు ఇవ్వండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని సన్మానించిన గౌడసంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: శేరిగూడలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కల్లుగీత కార్మిక(గౌడ)సంఘం అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్ కోరారు. గురువారం వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. హాల్ నిర్మాణానికి సుమారు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘం వైస్ ప్రెసిడెంట్ శ్రీరాములుగౌడ్, జనరల్ సెక్రటరీ అంజయ్య, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, వెంకటేశ్, రాములు, సత్తయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పడవ



పడవలో పయనిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: ప్లాస్టిక్ వ్యర్థాలతో మున్సిపల్ సిబ్బంది వినూత్న ప్రయోగం చేశారు. పడవను తయారు చేసి ఔరా అనిపించారు. దానిని గణనాథుల నిమజ్జనోత్సవం నేపథ్యంలో మాసబ్ చెరువులో వినియోగిస్తుండడంతో భక్తులు దానికి ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినయ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సురేష్, బాలరాజులు మూడు రోజుల పాటు శ్రమించి పడవను తయారు చేశారని తెలిపారు. ఇందుకు 400 ప్లాస్టిక్ బాటిళ్లు, వెదురు కర్రలు, ట్యూబ్‌లను ఉపయోగించారని, ఇది 200 కిలోల వరకు బరువు మోస్తుందని పేర్కొన్నారు. పడవను రూపొందించిన అధికారులు, సహకరించిన సిబ్బంది శివ, సుధాకర్‌లను కమిషనర్ అభినందించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



నిరాహార దీక్షలో బీజేపీ నాయకులు

కడ్తాల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, అర్హులకు ఆరు గ్యారంటీలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 20 నెలలైనా.. హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు సాయిలాల్, శ్రీశైలంగౌడ్, భగీరథ్, మాన్య, యాదగిరి, కుమార్, రాజు, మల్లేశ్, రవి, సురేశ్, కరుణాకర్‌రెడ్డి, మహేశ్, శివయ్య, విక్రమ్, వెంకటేశ్‌గౌడ్, శంకర్, నరేశ్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

జీవితాన్ని మార్చేది చదువొక్కటే

ఆర్డీఓ అనంత రెడ్డి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఆర్డీఓ

మాడ్గుల: విద్యార్థులు క్రమ శిక్షణతో చదవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి ఇర్విన్ జిల్లా ఉన్నత పాఠశాలలో పాలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎమ్ఎస్, ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో గుర్తింపును తెచ్చేది, జీవితాలను మార్చేది చదువు ఒక్కటేనన్నారు. పేదరికాన్ని అధిగమించి, విద్యలో రాణించినప్పుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాంరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలి.. గోతులు ఏర్పడి



కుత్బుల్లాపూర్ రోడ్డు దుస్థితి

- అధ్వానంగా కుత్బుల్లాపూర్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం

హయత్‌నగర్: అదీ నగరానికి సమీపాన ఉన్న గ్రామం. రెండు వైపులా అటవీ భూములు, ఓ వైపు మూసీ ఉంది. కానీ ఇక్కడి ప్రజల సమస్యలను పట్టించుకునే వారు లేరు. గ్రామంలో మౌలిక సదుపాయాలు సంగతి ఎలా ఉన్నా.. కనీస రోడ్డు రవాణా సౌకర్యం సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఇదీ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుత్బుల్లాపూర్ గ్రామ ప్రజల దుస్థితి.

మరోమార్గం లేక..

ఈ ఊరికి కుంట్లూర్ ఆర్ఎస్ఆర్ కూడలి వరకు సుమారు 4 కిలో మీటర్ల ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు ఉంది. గ్రామస్తులు నగరం వైపు వెళ్లాలంటే ఉన్నది ఇదొక్కటే దారి. ఈ మార్గం కుంట్లూర్‌లో ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డుకు అనుసంధానం. గ్రామం నుంచి ఈ లింకు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. కంకర తేలి, అడుగడుగునా గోతులు ఏర్పడి ప్రయాణం నరకరంగా మారింది. మరోమార్గం లేక పరిసర ప్రాంత ప్రజలు ఈ బీటి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు.

పదిహేడు ఏళ్లుగా..

ఇంతటి అధ్వాన స్థితిలో ఉన్న కుత్బుల్లాపూర్ రోడ్డు దుస్థితి సుమారు 17 ఏళ్లుగా ఇలాగే ఉందని, అయినా ప్రజాప్రతినిధులు, పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీని వలన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోగా, చాలామంది తీవ్రంగా గాయపడ్డారని వాపోయారు. ఇదే విషయమై పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా రోడ్డు దుస్థితిలో ఎలాంటి మార్పు రాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

హామీలకే పరిమితం



ఎన్నికల సమయంలో రోడ్డును అభివృద్ధి చేస్తామని రాజకీయ నాయకులు హామీ ఇస్తున్నారు. ఆ తరువాత ఇటువైపు చూసిన వారు లేరు. ఇలా పదిహేను సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. నేతల నిర్లక్ష్యం వలన మార్గం మెరుగు పడటం లేదు. సమస్య తీరడం లేదు.

– గోవర్ధన్, వికలాంగుల హక్కుల పోరాట సమితి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అటవీ శాఖ అభ్యంతరం



ఈ రహదారి విస్తరణ చేసి, ఫార్మేషన్ చేయాలని నిర్ణయించాం. రోడ్డుకు ఇరువైపులా అటవీ భూములు ఉన్నాయి. దీంతో ఆ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వారికి లేఖ రాశాం. అనుమతి లభించగానే.. గౌరెల్లి వరకు రోడ్డును అభివృద్ధి చేస్తాం.

– మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్



ఆమనగల్లు: తలకొండపల్లి చుక్కాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈఓ చంప్లనాయక్ తదితరులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులను సన్మానించిన విద్యాధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదిబట్ల బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పరమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య, రజిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: శెట్టిపల్లిలో స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తలకొండపల్లి మండలం చుక్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను.. ఎంఈఓ చంప్లనాయక్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీను, పాండు, విశ్రాంత హెచ్ఎం రామనాథం, ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, శ్రీను, బాలకోటి, శంకర్, సాయిబాబా, పాండు, రజనీ, మాధవి, కవిత, షెహనాజ్, భారతి, శైలజ ఉన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు యాదగిరి, శివలింగం, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రియాంక, సంధ్యలను ఎంఈఓ పాండు ఆధ్వర్యంలో సన్మానించారు.



నెత్తిన మొలకల బుట్టలతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితరులు

సంప్రదాయానికి ప్రతీక తీజ్

మంచాల: సంప్రదాయానికి ప్రతీక తీజ్ ఉత్సవాలు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి చెన్నారెడ్డిగూడలో గిరిజనులు గురువారం సాయంత్రం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో వేర్వేరుగా పాల్గొని వారు మాట్లాడారు. గిరిజన మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పండుగ తీజ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, యువజన విభాగం నేతలు జెర్కోని రాజు, బద్రినాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య, రాష్ట్ర నాయకులు డీజీ నర్సింగ్ రావు, భూపాల్, రమేష్, వెంకటేశ్, మండల కార్యదర్శి జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు జెనిగె వెంకటేశ్, బుగ్గరాములు, బాషయ్య తదితరులు పాల్గొన్నారు.

26న టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

ఆమనగల్లు: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తుందని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో గురువారం ఫెడరేషన్ ఆమనగల్లు బ్లాక్‌స్థాయి విస్తృతస్థాయి సమావేశం.. బ్లాక్ అధ్యక్షుడు దరువుల శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. గతంలో ఉన్న జర్నలిస్టు సంఘాలు విలేకరుల గురించి పట్టించుకోలేదని, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 26న కందుకూరులో నిర్వహించే జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా మహాసభల బ్లాక్ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా యూనిస్, సభ్యులుగా శంకర్, నర్సింహ, చంద్రశేఖర్, యాదగిరి, తిరుపతి, చంద్రకుమార్, మహేశ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో మహాసభ ఆహ్వాన కమిటీ చైర్మన్ సురేశ్, కన్వీనర్ గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు యూనిస్, కోట్ల వెంకటేశ్, ఉపాధ్యక్షులు నర్సింహ, చంద్రశేఖర్, కోశాధికారి యాదగిరి, సభ్యులు చంద్రశేఖర్, తిరుపతి, శేఖర్, శ్రీను, తిరుపతయ్య, రాజు, యాదగిరి, అఫీజ్, జంగయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనలో అర్హులందరికీ లబ్ధి

- ఎవరూ అధైర్య పడొద్దు
- ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం. ఎవరూ అధైర్య పడొద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పక్కా ఇళ్లు, రేషన్ కార్డుల కోసం పేద ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదురు చూశారని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనతి కాలంలో నిరుపేదల సొంతింటి కల నెరవేర్చామని, అర్హులందరికీ ఆహార భద్రత కార్డులు అందజేశామని పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

పదేళ్ల అనంతరం తెలంగాణలో కార్యకర్తల కష్టంతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. వారే పార్టీ బలమని, కష్టకాలంలో పనిచేసిన వారికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మరింత కష్టపడి.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించి, సత్తాచాటాలని పిలుపునిచ్చారు. త్వరలో పార్టీ కమిటీల నియామకం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు శేఖర్, గురువయ్య, అనిల్, రాజు, శివ, రాకేశ్ తదితరులు అధికార పార్టీలో చేరారు. అంతకు ముందు నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, తలకొండపల్లి మండలానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మాడ్గుల మండలం అన్నెబోయినపల్లికి చెందిన రైతులు.. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో భూములు పోకుండా చూడాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ప్రసాద్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత, మాజీ వైస్ ఎంపీపీలు అనంతరెడ్డి, నారాయణ, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం ఉన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

కడ్తాల్: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రం చల్లంపల్లిలో గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఏర్పాటు చేసిన పశుదాన కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు సురేందర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, అభిషేక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేశ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్

మీర్‌పేట: పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అవసరాల నిమిత్తం అప్పటి కమిషనర్ ఆరు నెలల క్రితం 34 మందిని కాంట్రాక్ట్ పేరుతో విధుల్లోకి చేర్చుకొని ఇప్పటివరకు వేతనాలు ఇవ్వకపోడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆరునెలల వేతనాలు చెల్లించడంతో పాటు పాత కార్మికుల వలె పర్మినెంట్ చేసి అర్హత కలిగిన వారిని వివిధ కేటగిరీలలో ప్రమోషన్లు కల్పించాలన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు బాబు, నాయకులు యాదగిరి, భారతమ్మ ఉన్నారు.



ఆమనగల్లు: శక్తియూత్ గణనాథుడి సన్నిధిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



కడ్తాల్: గడ్డమీదితండాలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు



ఆమనగల్లు: చంద్రాయణపల్లి తండాలో..

గణపయ్యా.. విఘ్నాలు తొలగించయ్యా

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గ పరిధి ప్రాంతాల్లో వాడవాడలా కొలువుదీరిన బొజ్జగణపయ్యలకు గురువారం భక్తులు విశేష పూజలు చేశారు. స్వామివారికి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. వినాయక విఘ్నాలు తొలగించయ్యా అని వేడుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల నిమజ్జనోత్సవం చేశారు. ఊరేగింపుగా, ఆటపాటలతో పార్వతీ పుత్రుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. నిమజ్జనాన్ని పురస్కరించుకొని స్వామివారి చేతిలోని లడ్డూను వేలంలో కైవసం చేసుకోవడానికి భక్తులు పోటీపడ్డారు.

–సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: వంపుగూడలో పూజలు అందుకుంటున్న గణనాథుడు



ఆమనగల్లు: విరాయిపల్లిలో..



యాచారం: నందివనపర్తిలో.. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు తదితరులు



యాచారం: నందివనపర్తిలో అన్నదానం..



ఇబ్రహీంపట్నం: పవన్‌పురి కాలనీలో..

రోడ్ల నిర్మాణానికి నిధులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బండలేమూర్ రోడ్డు(ఫైల్)

మంచాల: రంగారెడ్డి- యాదాద్రి భువనగిరి జిల్లాల సరిహద్దు గ్రామాల రోడ్డు సమస్య తీరనుంది. అధ్వానరోడ్లతో ఇంతకాలం ఇబ్బంది పడిన ప్రజలకు ఉపశమనం లభించనుంది. రోడ్ల దుస్థితిని చూసి ఆర్టీసీ బస్సులు కూడా సరిగా వచ్చేవికావని, ఇదే విషయమై పాలకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని సరిహద్దు గ్రామాల ప్రజలు ఆరోపించారు. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి జిల్లా గ్రామం కేలోత్‌తండా నుంచి రంగారెడ్డి జిల్లా బండలేమూర్ వరకు బీటిరోడ్డు మంజూరు చేసింది. 6కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం రూ.6.60 కోట్లు మంజూరు చేసింది. అదే విధంగా రంగాపూర్ నుంచి వయా దాద్‌పల్లి మీదుగా మాల్ వరకు 12 కిలో మీటర్ల రహదారి విస్తరణకు రూ.9 కోట్లను కేటాయించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి, రవాణామార్గం మెరుగుపర్చాలని కోరుతున్నారు.